ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 14 ఏప్రిల్ 2024

కేడర్‌లో.. లోకల్ జోష్

లోక్‌సభ పోరు తరువాత స్థానిక సమరం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

పార్లమెంట్ పోరు ముగియగానే స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం పూర్తి కాగా, జూన్, జూలై నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో స్థానిక ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన ఆశావహుల్లో జోష్ నింపింది. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తల పనితీరు ప్రతిపాదికన పోటీకి అవకాశం ఇస్తామని తమ పార్టీ కేడర్‌కు సీఎం భరోసానిచ్చారు. మరోవైపు ప్రతిపక్షాల్లోనూ ఈ ప్రకటన జోష్ నింపతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,567 మందికి సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ పదవులు రానుండటంతో పాటు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు కూడా కేడర్‌ను ఊరిస్తున్నాయి.

జూలైలో స్థానిక సమరం

పార్లమెంట్ ఎన్నికల్లో తమ నేతల విజయాల కోసం మండుటెండలో శ్రమిస్తున్న కేడర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చల్లని కబురు చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటన చేశారు. మే 13న తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుండగా జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం చేసిన ప్రకటన ప్రకారం జూలైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందనే అభిప్రాయాలున్నాయి. అయితే ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,688 గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి 1వ తేదీన పదవీకాలం ముగిసింది. అయితే బీసీ జనాభా లెక్కలు తేలకపోవటంతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేశారు. గ్రామ పంచాయతీలకు పర్సన్ ఇంచార్జ్‌లుగా అధికారులను ప్రభుత్వం నియమించింది. జూలై నెల మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కానుంది. దీంతో సర్పంచ్ స్థానాలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూడా జూలై, ఆగస్టుల్లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688 గ్రామ పంచాయతీలు ఉండగా, కొత్తగా ఏర్పడిన మండలాలతో కలిపి 74 జడ్పీటీసీ పదవులకు, 805 ఎంపీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,567 మందిని పదవులు వరించనున్నాయి. ఇటీవల కొత్తగా భూపాలపల్లిలో గోరికొత్తపల్లి, మహబూబాబాద్ జిల్లాలో ఇనుగుర్తి, సిరోలు మండలాలు ఏర్పడ్డాయి. వీటిలో కొత్తగా మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) స్థానాలను పెంచే అవకాశం ఉంది. ఎంపీటీసీల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే 2009 నుంచి ములుగు జిల్లా మంగపేట మండలంలో 115 ఎంపీటీసీ స్థానాలకు, 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేవు. ఈసారి వీటికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే జనవరి మునిసిపాలిటీల పదవీ కాలం పూర్తికానుంది. ఫిబ్రవరిలో సహకార సంఘాల పదవీకాలం ముగిసి పోనుంది. వీటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తే మునిసిపల్ కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు కూడా ద్వితీయ శ్రేణి నేతలకు దక్కనున్నాయి. అలాగే సహకార సంఘం ఎన్నికల్లో గెలిచిన డైరెక్టర్లకు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్లు అవకాశాలు రానున్నాయి.అలాగే పీఏసీఎస్ చైర్మన్ల నుంచి డీసీసీబీ డైరెక్టర్‌గా, చైర్మన్‌గా, ఓడీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ లాంటి పదవులు జిల్లా స్థాయి నేతలకు లభించనున్నాయి. సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తరువాత మునిసిపాలటి, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించి మార్చి వరకు అన్ని రకాల ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఆ తరువాత నుంచి పరిపాలనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం దృష్టిపెట్టనుంది. కాగా, లోక్‌సభ ఎన్నికల

మిగతా 7వ పేజీలో..



- జూలైలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- లోక్‌సభ ఎన్నికల్లో పనితీరు ప్రాతిపదికనే అవకాశాలన్న సీఎం
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు, ఇందిరమ్మ కమిటీలపై ఆశలు
- ప్రతిపక్ష నేతల్లోనూ హుషారు
- ఉమ్మడి జిల్లాలో 2,567 మందికి స్థానిక పదవులు

జిల్లా	సర్పంచులు	ఎంపీటీసీ	జడ్పీటీసీ
వరంగల్	323	134	11
హనుమకొండ	208	129	12
భూపాలపల్లి	241	117	12
ములుగు	174	87	09
మహ-బాద్	461	198	18
జనగామ	281	140	12
మొత్తం	1,688	805	74

నామినేటెడ్ పదవులు.. ఇందిరమ్మ కమిటీలు

డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురికి వివిధ స్థాయిలో కార్పొరేషన్ పదవులు లభించాయి. అయితే జిల్లా స్థాయి, వ్యవసాయ కమిటీలు, ఆలయ కమిటీలను నియమించాల్సి ఉంది. వీటన్నింటిని కూడా లోక్‌సభ ఎన్నికల తరువాత నియమిస్తామని సీఎం ప్రకటించటంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపి నట్లైంది. అలాగే ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు, వాలంటీర్ల నియామకం చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. దీంతో ప్రతి గ్రామం నుంచి పది మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలు, వలంటీర్ల పదవులు లభించే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన తీరును బట్టే పదవులు ఇస్తామని సీఎం కాంగ్రెస్ కార్యకర్తలకు లింకు పెట్టడంతో ఎంపీ అభ్యర్థుల గెలుపునకు శ్రమించక తప్పని పరిస్థితి ఏర్పడిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులుగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ స్థానం నుంచి బలరాంనాయక్ పోటీ చేస్తున్నారు. దీంతో వీరి గెలుపు బాధ్యతలను సీఎం పరోక్షంగా కార్యకర్తలపై భుజస్కంధాలపై పెట్టారన్న చర్చ జరుగుతోంది.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కడియంకు నైతిక విలువలు లేవు..

- రాజకీయంగా దిగజారాడు..
- ప్రజాస్వామ్యం గురించి శ్రీహరి మాట్లాడడం విడ్డూరం
- లోక్‌సభ ఎన్నికల్లో ఓరుగల్లు ఓటర్లు బుద్ధి చెప్పాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వడ్డేపల్లి, ఏప్రిల్ 13: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి నైతిక విలువలు కోల్పోయారని, రాజకీయంగా దిగజారిపోయి పిచ్చి కూతలు కూస్తున్నాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియం శ్రీహరి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. కడియం శ్రీహరి సహనం కోల్పోయి పిచ్చికుక్కకన్నా హీనంగా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన కడియం శ్రీహరికి ఏ మాత్రం నైతిక విలువలు ఉన్నా ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న ఈటల రాజేందర్ తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలోకి మారితే రాళ్లతో కొట్టి చంపండని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, అదే పార్టీ మారిన కడియం శ్రీహరికి ఇది వర్తించదా? అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ కూలిపోతుందన్న కడియం శ్రీహరి.. మళ్లీ అదేపార్టీలో ఎందుకు చేరారని ప్రశ్నించారు.

తాను వ్యక్తిగత, స్వార్థ రాజకీయాలు చేయడం లేదని మంద కృష్ణ మాదిగ చెప్పారు. 2013లో వైఎస్ జగన్ రాజ్యసభ పదవి ఇస్తానని చెప్పినా దాన్ని తాను వదులుకున్నానని పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్ ఇస్తామని ఒక పార్టీ ప్రకటించినా దాన్ని నిరాకరించానని మంద కృష్ణ అన్నారు. నీచ రాజకీయాలు నడిపిన చరిత్ర కడియం శ్రీహరిదేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని మాదిగ జాతికి ద్రోహం చేస్తున్నాడన్నారు. మూడు కండువాలు ముచ్చటగా మార్చుకున్న ఘనత కడియం శ్రీహరికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. నీచమైన చరిత్ర గల కడియం శ్రీహరి.. ఎదుటి వ్యక్తి ఎదుగుదలను జీర్ణించుకోలేడని చెప్పారు. పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్ లోక్‌సభ టికెట్లను మాదిగలకు ఇవ్వకుండా అడ్డుకున్నది కడియం శ్రీహరేనని ఆరోపించారు. ప్రధాని మోదీవల్ల పాకిస్థాన్‌కు నిద్రపట్టడం లేదని మంద కృష్ణ చెప్పారు. దేశంలో అవినీతికి పాల్పడిన వారిని బీజేపీ ప్రభుత్వం జైలులో పెడుతుందని పేర్కొన్నారు. మహిళా బిల్లుకు రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత బీజేపీదేనని, జమ్మూ కాశ్మీర్‌లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించిన మహానేత నరేంద్ర మోదీనేనని మంద కృష్ణ స్పష్టం చేశారు. ప్రధానిగా ఇందిరాగాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించలేదని అదే బిల్లును నరేంద్రమోదీ ఆమోదించి మహిళా సమాజానికి న్యాయం చేశారని చెప్పారు. రాజ్యాంగం మార్చడం ఎవరితరం కాదని అన్నారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కడియం శ్రీహరికి లేదని మంద కృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో 50 శాతం ఉన్న బీసీలకు రెండు లోక్‌సభ స్థానాలే కేటాయించి, 25 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ టికెట్ల కేటాయింపులో మాదిగ సమాజానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ పుట్ట భిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంద రాజు, ఏకు శంకర్, కట్ల రాజశేఖర్, గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతి సాగర్, రేణుకుంట్ల ఉమామహేష్, సుంచు రజినికుమార్ మాదిగ పాల్గొన్నారు.



చామంతి పూల అలంకరణలో భద్రకాళి దేవి

భద్రకాళికి లక్ష చామంతులతో అర్చన

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 13: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారికి వసంతోత్సవ నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరింది. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, నవరాత్రి ఉత్సవజపం, హోమం, అర్చన, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి తెలుపు రంగు కలిగిన లక్ష చామంతి పూలతో అర్చన నిర్వహించారు. ప్రతీ ప్రాణి జీవితాన్ని నవగ్రహాలే నియంత్రిస్తాయని, ఈ నవగ్రహాల రూపంలో ఉండే పరమాత్మ చైతన్యం ఆ జగన్మాతయేయని, అందుకే ఆయా తిథులందు ఆరాధించడం జరుగుతుందని భద్రకాళి ఆలయం ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈవో శేషు భారతి ఆలయంలోని ఏర్పాట్లను భక్తుల దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి..

ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భగవన్‌రెడ్డి

మట్టెవాడ, ఏప్రిల్ 13: వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ మట్టెవాడలోని జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 20 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 14న విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళి, 15న వరంగల్ జిల్లాలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్, 16న అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్థులు, షాపింగ్ మాల్స్, కాంప్లెక్స్‌ల్లో ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్లు, విద్యుత్ షాట్ సర్క్యూట్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే 17న హాస్పటల్‌లో అగ్ని ప్రమాదాలు నివారించే పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు, సదస్సులు. 18న గ్యాస్ గోదాములు, పెట్రోల్ బంకుల వద్ద మాక్‌డ్రిల్, అవగాహన కార్యక్రమాలు, 19న విద్యాసంస్థలు, కళాశాలలు, వాణిజ్య భవన సముదాయాల వద్ద మాక్ డ్రిల్, అవగాహన, 20న అగ్ని మాపక కేంద్రాల్లో ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్ని మాపక అధికారులు జైపాల్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.రవీందర్, నాగరాజు, హనుమకొండ జిల్లా డీపీఆర్‌వో భానుప్రసాద్ పాల్గొన్నారు.



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 13: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ప్రవీణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్ రెడ్డి, అగ్నిమాపక సహాయ అధికారి జయపాల్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ల రవీందర్, నాగరాజు పాల్గొన్నారు.

అగ్గి అంటుకుంటే బుగ్గే..

- నగరంలో విరివిగా అగ్ని ప్రమాదాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

7

శనివారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 34.0°C	కనిష్ఠం : 24.5°C

భారమైన చీరల భద్రత

వరుస ఎన్నికలతో జీపీ కార్యాలయాల్లోనే బతుకమ్మ చీరలు

మూలుగుతున్న క్రికెట్ కిట్లు, టీ షర్టులు, క్రీడా సామగ్రి

నెక్కొండ, ఏప్రిల్ 13: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామ కార్యదర్శులు పనిభారంతో ఇబ్బందులు పడుతుండగా బతుకమ్మ చీరలను భద్రపర్చడం తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఎంపీ, తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ఇప్పట్లో చీరల పంపిణీ అసాధ్యమంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. 2023, అక్టోబరులో జిల్లాకు 3లక్షల 42వేల582 చీరలను సరఫరా చేసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యువత ఓట్లు పొందేందుకు అదనంగా క్రికెట్ కిట్లు, టీషర్టులు, క్రీడా వస్తువుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. కాగా, చీరలతోపాటు క్రికెట్ కిట్లు, టీషర్టులు పల్లెలకు చేరవేయడంలో జాప్యం జరిగింది. ఎన్నికల సమయం దగ్గర పడడంతో బతుకమ్మ పండుగ ముందు హడావిడిగా 20నుంచి 30 శాతం మాత్రమే చీరలనుపంపిణీ చేశారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో కోడ్ అమలుతో మిగతా పంపిణీకి బ్రేక్ పడింది. ఇప్పుడా చీరలను భద్రపర్చడం కార్యదర్శులకు ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలో నూతనంగా ఏర్పడిన పంచాయతీలతో పాటు గత పంచాయతీల్లో 20శాతం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అరకొర వసతులతో తాత్కాలిక భవనాల్లో పాలన సాగిస్తుండగా బతుకమ్మ చీరలు, క్రీడా పరికరాలను భద్రపర్చడం ఇబ్బందిగా మారుతోంది. చీరలను ఎలుకలు కొడితే బాధ్యులు ఎవరంటూ కార్యదర్శులు వాపోతున్నారు.



నెక్కొండ జీపీలో నిల్వచేసిన చీరలు

మూలుగుతున్న ఆట వస్తువులు

యువత కోసం ఒక్కో గ్రామానికి 75 టీ షర్టులు, క్రికెట్ కిట్లు, వాలీబాల్ నెట్, రెండు వాలీబాల్స్, ఒక వాలీబాల్ పంపు, రెండు స్కిప్పింగ్ తాళ్లు, టెన్నికాయిట్ బాల్‌ను పంపిణీ చేశారు. ఈ క్రీడా వస్తువులను పది శాతం మాత్రమే పంపిణీ చేయగా, 90శాతం కిట్లు పంచాయతీ కార్యాలయాల్లోనే ఉన్నాయి.

కేసీఆర్ ఫొటో ఉండటంతో..

కోడ్ ముగిసిన వెంటనే బతుకమ్మ కానుకల పంపిణీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే చీరలతోపాటు క్రీడా వస్తువులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో ఉండటంతో అధికార కాంగ్రెస్ పాలకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడం ఖాయమంటున్నారు. ప్రభుత్వ నిధులు వృథా జరగకుండా ఉండాలనే ఆలోచన అధికార పార్టీ నేతల్లో ఉంటే కేసీఆర్ ఫొటో ఉన్నా, అట్టలను తొలగించి చీరలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. కానీ, మిగతా క్రీడా వస్తువులపై ముద్రించిన కేసీఆర్ ఫొటో తొలగించడం సాధ్యం కాదంటున్నారు.

మండలాలకు సరఫరా అయిన చీరలు

చెన్నారావుపేట మండలానికి 16,261, దుగ్గొండికి 18,099, గీసుగొండకు 22,876, ఖానాపురానికి 13,295, ఖిలావరంగల్‌కు 62,757, నల్లబెల్లికి 15,060, నర్సంపేటకు 28,557, నెక్కొండకు 21,103, పర్వతగిరికి 19,038, రాయపర్తికి 22,075, సంగెంకు 18,764, వర్ధన్నపేటకు 19,164, వరంగల్ మండలానికి 65,533 చీరలను సరఫరా చేశారు.

ప్రేమ వ్యవహారంపై తల్లిదండ్రుల మందలింపు

మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్య



రవి కిరణ్(ఫైల్)

నెక్కొండ, ఏప్రిల్ 13: ప్రేమించిన యువతిని ఇంటికి తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం. గొల్లపల్లికి చెందిన నాగపురి రవికిరణ్ (24) శుభకార్యాలయాలకు డెకరేషన్ చేస్తూ జీవిస్తున్నాడు. రవికి తల్లిదండ్రులతోపాటు చెల్లి ఉంది. ఇదిలాఉండగా ఇదే గ్రామానికి చెందిన ఓ యువతిని రవి ప్రేమించాడు. మూడు నెలల క్రితం సదరు యువతిని ఇంటికి తీసుకొచ్చి ఉంచాడు. అప్పటి నుంచి ఆ అమ్మాయి విషయంలో తల్లిదండ్రులతో రవికి తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన రవి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లి స్వరూప, యువతి చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్‌నిర్మించాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 13: కాకతీయరాజులు రామప్ప గుడి సమీపంలోని రామానుజపురంలో నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూ టాలయం శిథిలావస్థలో ఉందని, దాన్ని పునర్‌నిర్మించాలని ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఎరుకల సమాజం అభివృద్ధి కోసం రూ.500కోట్లు ఎరుకల కార్పొరేషన్‌కు కేటాయించి విద్యావంతుడైన ఎరుకల కులస్తుడినే చైర్మన్‌గా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆదివాసీ, గిరిజన తెగల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు

ఈసమావేశంలో ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్దిల శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు బూనాద్రి రంజిత్‌కుమార్, బిజిలి ప్రశాంత్, దుగ్యాల రమేష్, పులిచేరు రవీందర్, పులిచేరు చంద్రయ్య, లోకిని చందర్, మానుపాటి సురేందర్, పులిచేరు చిన్న సారయ్య, పల్లకొండ ప్రభాకర్, ఓని సదానందం, కేతిరి రాజు, కుతాడి శ్రీనివాస్, రేవెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



అగ్గి అంటుకుంటే బుగ్గే..



- నగరంలో విరివిగా అగ్ని ప్రమాదాలు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- కమర్షియల్ కాంప్లెక్సుల్లో ఫైర్‌సేఫ్టీ నిల్
- ఎన్‌వోసీలు తీసుకున్న దాఖలాలు లేవు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అగ్గి అంటుకుంటే బుగ్గే అనే పరిస్థితి ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో కేవలం పదమూడుమాత్రమే ఫైర్ స్టేషన్‌లున్నాయి. వరంగల్ నగరంలో కేవలం రెండు స్టేషన్‌లు మాత్రమే ఉండటం విశేషం. నగర విస్తీర్ణంతో పాటు వ్యాపార సముదాయ భవనాలు, విద్యాకేంద్రాలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాల సంఖ్య వేగంగా పెరుగుతున్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌ల సంఖ్య పెరగలేదు. ఏజెన్సీ ఏరియాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఇక అంతే సంగతులు, ములుగులో ఉన్న స్టేషన్‌నుంచి వాహనం వెళ్లేలోగా జరిగే నష్టం జరిగి తీరుతుంది. ఏటూరునాగారం ఏరియాలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ పాలకులు దృష్టి సారించకపోవడం గమనార్హం. నియోజకవర్గ కేంద్రాలకే ఫైర్‌స్టేషన్‌లు పరిమితం కావడంతో ఫలితం లేకుండా పోతోంది. వరంగల్ నగరం మినహా ప్రతీ నియోజకవర్గ విస్తీర్ణం ఎటూ 50 కిలోమీటర్లకు పైగానే ఉంటుంది. ఇలా స్టేషన్‌ల సంఖ్య పెంచకపోవడం, పాత వాహనాలు, అరకొర సిబ్బంది ఉండటంతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటం విశేషం. ఈక్రమంలో ఆదివారం నుంచి అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంది.

నిబంధనలకు నీళ్లు

వరంగల్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు విరివిగా జరుగుతున్నాయి. వరంగల్ నగరంలో వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థల భవనాలు, ఆస్పత్రుల భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్న వారు నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. ప్రతీ వ్యాపార సముదాయాల్లో ఫైర్ వాహనం తిరిగేలా స్థలం, ఫైర్‌సేఫ్టీ పరికరాలు, ఎమర్జెన్సీ ద్వారాలు ఇలా ఏర్పాట్లు తప్పనిసరి. అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాలి. ఇలాంటి సౌకర్యాలులేని భవనాలే ఎక్కువగా నగరంలో ఉన్నాయి. అధికారుల చేతులు తడుపుతున్న వ్యాపారులు నిబంధనలు బుట్టదాఖలు చేస్తూ అనుమతులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అందినంత దండుకుంటున్న అధికారులు తనిఖీలు చేసిన పాపానపోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇటీవల వరంగల్‌లో జకోటియా కాంప్లెక్సులో జరిగిన అగ్ని ప్రమాదం సంఘటన, గతంలో హనుమకొండలో జుబేర్ బుక్ స్టాల్, కల్యాణలక్ష్మీ సారీ సెంటర్‌లో, కరీంనగర్ రోడ్డులోని ఒక పెట్రోల్ పంపులో జరిగిన సంఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ సంఘటనల్లో మూడురోజుల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తే కానీ మంటలు నియంత్రించలేని పరిస్థితి ఏర్పడింది. ముందస్తు చర్యలు లేకపోవడం వల్లనే అగ్ని ప్రమాదాలు నిలువరించలేని దుస్థితి ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. వారోత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాకుండా వ్యాపార సముదాయాల్లో నిత్యం తనిఖీలు చేస్తూ నిబంధనలు కఠినతరం చేయాల్సి ఉంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

మామిడి భగవాన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్, వరంగల్



ముందస్తు చర్యలతో అగ్ని ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చు. వ్యాపార సముదాయాలు నిర్మించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఫైర్ సెఫ్టీ చర్యలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి. జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 8712699304, 8712699305 నంబర్లకు సమాచారం అందించాలి. ఆదివారం నుంచి వారంపాటు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

మార్కెట్లో వేలంలో మారిన సమయపాలన

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 13: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇబ్బంది పడకుండా ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం నుంచి జూన్ 15 వరకు వేలం పాటల సమయాలలో మార్పులు చేసినట్లు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్కెట్లో మిర్చి బీటు ఉదయం 7.05 గంటలకు, పత్తి బీటు 8.05 గంటలకు, పల్లికాయ బీటు 8.15గంటలకు, పసుపు బీటు 8.30 గంటలకు, అపరాల బీటు 8.45 గంటలకు మారినట్లు తెలిపింది. అలాగే ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ప్రతీ బుధవారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ తెలిపింది. రైతులు, కార్మికులు, అడ్తీ, ఖరీదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరింది.

17 నుంచి ఉచిత కోచింగ్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి నిర్వహించేకామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీజీఈటీ)లో ఎంఎస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల రసాయన శాస్త్రత విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ (బ్లెండెడ్ విధానం)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి, కేడీసీ రసాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.రమేశ్ తెలిపారు. ఉచిత శిక్షణ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభం అవుతుందని, 60రోజులపాటు జరుగుతోందని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఏ కళాశాలకు చెందిన వారైన ఉచిత శిక్షణకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 98669-62589 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న జిల్లాస్థాయి చెస్ పోటీలు


వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 13: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన అండర్-17 ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి బాలబాలికల చెస్ పోటీలను టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ ప్రతినిధి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా 1 జనవరి 2017లోపు జన్మించిన 7ఏళ్ల బాలబాలికలు ఈ చెస్‌పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 90595 22986లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 13: జిల్లాలోని పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం బెల్టు షాపులపై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.24వేల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో రూ.6760, సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లిలో రూ.7360, ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కంపేటలో రూ.5140, అగ్రంపహాడ్‌లో రూ.4560 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ ఎ.మధుసూధన్ ధ్రువీకరించారు.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్

అర్హత సాధిస్తేనే పదోన్నతులు
ప్రత్యేక పరీక్ష నిర్వహించాలంటున్న టీచర్లు



జనగామ కల్చరల్, ఏప్రిల్ 13: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పాసైతేనే పదోన్నతులకు అర్హులని ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) కొత్త నిబంధనలు విధించడంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన తాము ప్రస్తుతం పదోన్నతులు పొందేందుకు టెట్ తప్పనిసరి పాస్ కావాలనే నిబంధన పెట్టడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టెట్ అర్హత సాధించడం ఇప్పుడు సాధ్యమయ్యే పని కాదని, తమ కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కాగా రాష్ట్ర విద్యాశాఖ మాత్రం డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతో పాటే ప్రస్తుత ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాల్సిందేనని అంటోంది. ఏప్రిల్ నెలలో టెట్ నిర్వహించిన తర్వాతే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఉంటాయని పేర్కొంటోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

టెట్ నిర్వహణ ఇలా..

టెట్‌ను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. పూర్తి పేపరు 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే ఓసీలు 60 శాతం, బీసీలు 50 శాతం, ఎస్సీలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. పేపర్ - 1 ఉత్తీర్ణత కావాలంటే చైల్డ్ డెవలప్‌మెంట్, తెలుగు, ఇంగ్లీషు, గణితం, పర్యావరణానికి సంబంధించిన అంశాలుంటాయి. పేపర్ - 2 లో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఈ అంశాలన్నీ చదవడం ఇబ్బందికరమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎప్పుడో ఉద్యోగాలు పొందిన వారు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత ఉండాలని చెబుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అవన్నీ తాము చదవలేమని, తమకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

2009 లోనే టెట్ ఉత్తర్వులు


ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అంటే 2009 లోనే ప్రభుత్వం టెట్ ఉత్తర్వులు జారీ చేసింది. 2010లో కొత్తగా డీఎస్సీ రాయాలనుకునేవారికి టెట్ నిర్వహించింది. కాని ఇన్‌సర్వీస్‌లో ఉన్నవారు కూడా టెట్ రాయాలని చెప్పలేదు. ఆ తరువాత 2013 లోనూ, 2015 లోనూ ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టింది. ఈ పదోన్నతుల్లో వారికి టెట్ మినహాయింపు ఇచ్చింది. అంతెందుకు ఇటీవల జరిగిన మల్టిజోన్ స్థాయి బదిలీల్లో కూడా టెట్ కు ప్రాధాన్యత కల్పించలేదు. మల్టిజోన్-1 లో జరిగిన బదిలీలు పొందిన వారికి టెట్ అడగలేదు. ఇతర కారణాల చేత మల్టిజోన్-2 లో బదిలీలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మల్టిజోన్-2 లో బదిలీలు పొందేవారు కూడా టెట్ రాయాలనడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని యాజమాన్యాలలో కలిపి 2500 మంది ఉపాధ్యాయులున్నారు. వీరిలో దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత లేనివారే.

హేతుబద్ధత ఏది?

అసలు టెట్ నిర్వహణకు హేతుబద్ధత లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఉపాధ్యాయ ఉద్యోగానికి డీఎస్సీ రాస్తే సరిపోతుందని, డీఎస్సీకి అర్హులైతే చాలని, ఉద్యోగార్హతకు, డీఎస్సీకి మధ్య ఈ టెట్ హేతురహితమని అంటున్నారు. ఎక్కడా లేని విధంగా టెట్ అర్హతకు ఓసీ, బీసీ, ఎస్సీలకు రకరకాల మార్కులను నిర్ణయించడం సరికాదని చెబుతున్నారు. కాగా పీఎస్ హెచ్‌ఎంలు ప్రైమరీ స్కూళ్లలో బోధిస్తారని, విధులు మాత్రం ఎస్‌జీటీ స్థాయిలో ఉంటాయని, అటువంటి వారు లెవెల్-1 పరీక్ష రాయాలా, లెవెల్-2 పరీక్ష రాయాలా అనేది ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని అంటున్నారు. పండిట్ టీచర్లు పేపర్-1 కానీ పేపర్-2 కానీ రాయలేరని, ఎందుకంటే వారికి సంబంధించిన సిలబస్ ఆ పేపర్లలో ఉండదని, వారికి ప్రత్యేకమైన ప్రశ్నాపత్రం ఉండాలని, అలాంటి వారు పదోన్నతులు పొందాలంటే ఎలా అనేదానికి విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి..

దొమ్మాట శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ప్రస్తుతం టెట్‌కు సమాయత్తమవుతున్న వారితో పోటీపడి పరీక్ష రాసే పరిస్థితులు కల్పించొద్దు. టెట్ నిర్వహణ హేతురహితంగా ఉంది. పీఎస్‌హెచ్‌ఎంలు, పీజీ హెచ్‌ఎంలు, పండిట్లు ఏ పరీక్ష రాయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. తప్పనిసరి పరిస్థితుల్లో టెట్ నిబంధన అమలు చేస్తే 2010 తరువాత నియామకమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి.

కేడర్‌లో.. లోకల్ జోష్

5వ పేజీ తరువాయి

తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావటంతో క్యాడర్‌ను పదవులు ఊరిస్తున్నాయి.

ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం..

లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఫైట్ ఉంటుందని సీఎం ప్రకటించటంతో ప్రతిపక్షాల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతం వరకు బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో బీఆర్ఎస్‌కు దీటుగా కాంగ్రెస్ జడ్పీటీసీలు, ఎంపీ టీసీలు విజయం సాధించారు. చాలా చోట్ల బీజేపీకి చెందిన సర్పంచులు, ఎంపీ టీసీలు కూడా గత ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జడ్పీ చైర్మన్లు కూడా బీఆర్ఎస్ పరిధిలోనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవటంతో నేతలు, కార్యకర్తలు వలస బాట పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కూడా బలపడుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తమ అభ్యర్థి గెలిస్తే, లోకల్ బాడీ ఎన్నికల్లో తమకు అవకాశం లభిస్తుందనే ఆశతో ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఉన్నారు. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనపై కాంగ్రెస్ క్యాడర్‌తో పాటు ప్రతిపక్షాల కార్యకర్తలు కూడా జోష్‌లో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.





ఉమ్మడి జిల్లా రైతు సదస్సు జయప్రదం చేయండి

దుగ్గొండి, ఏప్రిల్ 13 : వరంగల్ నగరంలోని అబ్బనికుంట తెలంగాణ రైతు సంఘం భవనంలో ఈ నెల 26న నిర్వహించే ఉమ్మడి జిల్లా రైతు సదస్సు విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లడె మోహన్‌రావు తెలిపారు. మండలంలోని గిర్నిబావిలో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలపై, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సులో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పుచ్చకాయల బుచ్చిరెడ్డి, నల్లవిజయ్, శంకర్‌రావు ఓరుగంటి తిరుపతిలు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ఆలయం గోపురంపై పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజారులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 13: ఏనుమాముల ఎస్ఆర్‌నగర్‌లో శ్రీ గణపతి, సుబ్రమణ్య, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు శనివారం త్రిదండి శ్రీనివాస ప్రతదర్ నాయరణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపయాగ్న, ధ్యానదీవాస, ఉద్వాసన, శాంతి, కళాపౌష్టిక, హోమాదులు, బీజన్యాసమ్ నిర్వహించారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, వరంగల్ ఎంపీ అభ్యర్థి, అరూరి రమేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎంను కలిసిన మున్నూరుకాపు సంఘం నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్నూరుకాపు సంఘం నేతలు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 13: మంత్రి కొండా సురేఖ, మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాపు సంఘం ప్రతినిధులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రభుత్వంలో కీలకమైన శాఖలు, అలాగే కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించినందుకు కాపు సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య గత ప్రభుత్వంలోనే టెండరైన మున్నూరుకాపు సంఘం భవన్‌కు సంబంధించిన రూ.5.5 కోట్ల నిధులను మంజూరు చేయాలని సీఎంను కోరారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

మహిమాన్వితుడు ఆంజనేయుడు

పంచముఖాలు, పది చేతులతో దర్శనం

భక్త కోటికి వరాలిచ్చే అభయాంజనేయుడు

17 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

గీసుగొండ, ఏప్రిల్ 13: మండలంలోని కొనాయిమాకుల సమీపంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ఎంతో మహిమాన్వితమైంది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇక్కడ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తే సర్వదోశాల పోతాయని ప్రతీతి. 11 ఫీట్ల ఎత్తు, పంచముఖాలు, పది చేతులతో ఉన్న ఆంజనేయస్వామి నల్లరాతి ఏకశిల విగ్రహాన్ని ఈ ఆలయంలో 2002లో ప్రతిష్ఠించారు. హుస్సేన్‌సాగర్‌లోని గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని తయారు చేసిన గణపతి స్థపతి సంవత్సరం పాటు తన శిష్య బృందంతో శ్రమించి ఆంజనేయస్వామి విగ్రహాన్ని తయారు చేశారు. స్వామి వారి ఐదు ముఖాల్లో హనుమంతుడు, హైగ్రీవుడు, వరాహం, లక్ష్మీనరసింహుడు, గరుత్మంతుడు ఉంటాయి. పది చేతుల్లో సర్పం, పర్వతం, డాలు, ఖడ్గం, సుందరకాండ పుస్తకం, గద, నాగలి, మరుచెంబు, కపాలం, సంజీవని ఆయుధాలు ఉండి దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులకు అభయాలిచ్చే అభయాంజనేయుడుగా పూజింపబడుతున్నాడు. ఇక్కడ ఉన్న హనుమాన్ విగ్రహం దక్షిణ భారతదేశంలోనే రెండో అతిపెద్ద విగ్రహంగా ప్రసిద్ధి గాంచింది.



పంచముఖ ఆంజనేయస్వామి

సువిశాల స్థలంలో ఉన్న ఈ ఆలయం భక్తులకు మానసికోల్లాసాన్ని, ఆధ్యాత్మిక భావాన్ని కలిగిస్తుంది. పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. పూర్వ వరంగల్ జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తరిస్తారు. ప్రతి సంవత్సరం హనుమాన్ దీక్షల కోసం వేలాది మంది భక్తులు వచ్చి మాలధారణలు చేస్తారు.

నవగ్రహ దోషాలు దూరం



హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, మాలధారణ దీక్షలు చేయడం వల్ల నవగ్రహ దోషాలు దూరం అవుతాయి. మనో ఆకాంక్షలు నెరవేరుతాయి. ఆయురారోగ్యాలు సిద్ధించి మానసిక ప్రశాంతత చేకూరుతుంది. హనుమాన్ దీక్షలు చేపట్టే భక్తులకు శని దోషాలు తొలగిపోతాయి. ప్రతి శనివారం ఆంజనేయస్వామిని దర్శించుకొని సుందరకాండ పఠిస్తే మానసిక నిశ్చలత్వం కలుగుతుంది.

- జాగర్లపూడి అయ్యప్ప శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు

17 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

కొనాయిమాకులలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి హనుమాన్ భక్తుల దీక్షా మాలధారణలు ప్రారంభం అవుతాయని ప్రధాన అర్చకులు అయ్యప్పశర్మ తెలిపారు. 41 రోజుల మండల దీక్షలు ఏప్రిల్ 9 నుంచి 23 వరకు, 21 రోజుల అర్థ మండల దీక్షలు మే 7 నుంచి 12 వరకు, 11 రోజుల దీక్షలు మే 18 నుంచి 22వ తేదీ వరకు భక్తులు చేపట్టవచ్చని అన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో భక్తులు అకుంటిత నియమాలతో హనుమాన్ దీక్షలు చేపడుతారు. హనుమాన్ భక్తులు 41 రోజుల మండల, 21 రోజుల అర్థ మండల, 11 రోజుల ఏకాదశ దిన దీక్షలు ఎంతో భక్తిశ్రద్ధలతో చేపడుతారు. మండుటెండలో సైతం కఠోర నియమాలు పాటిస్తారు. ఆలయంలోని పంచముఖాలతో ఉన్న 11 అడుగుల నల్లరాతి హనుమాన్ విగ్రహం భక్తుల్లో ఎంతో భక్తి పారవశ్యాన్ని నింపుతుంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భక్తులు మాలధారణల చేపట్టి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా మాలధారణలు వేసుకునేందుకు పెద్దఎత్తున వచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు సీతా ఆనంద్‌సా సోదరులు తెలిపారు.



హనుమాన్ ఆలయ ప్రాంగణం

ఎన్నికల విధులు సమన్వయంతో నిర్వహించాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, సమన్వయంతో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం డీఆర్వో శ్రీనివాస్‌తో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏచిన్న పొరపాటు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఇతర వస్తువులను సీజ్ చేసిన సందర్భంలో అన్ని బృందాలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులు ప్రతి రోజు రిపోర్టు నిర్ణీత ఫార్మాట్‌లో సమర్పించాలని, ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు డీసీవో సంజీవరెడ్డి, డీబీసీడీవో పుష్పలత, జడ్పీ సీఈవో రాంరెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, రమేశ్, విశ్వనారాయణ, రాజ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం యజ్ఞ యాగాలు



దత్తక్షేత్రంలో నక్షత్ర నవగ్రహ హోమం, పూర్ణాహుతిని నిర్వహిస్తున్న స్వామిజీ

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 13: లోక కల్యాణార్థం ఆలయాలు, పవిత్ర స్థలాల్లో యజ్ఞ యాగాలు నిర్వహించాలని మైసూర్ దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ గురుభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. వరంగల్‌కు విచ్చేసిన స్వామిజీ శనివారం రాత్రి దత్త క్షేత్రానికి చేరుకోగా భక్తులు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమంలో నక్షత్ర వనగ్రహ హోమం, మహా పూర్ణాహుతిని స్వామిజీ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి స్వామిజీ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో భక్తులందరు కూడా ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని, దైవారాధన, సమాజ సేవ, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. శనివారం ఉదయం స్వామిజీ చిన్నకోడెపాకలో ఆలయ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ శివరామకృష్ణ ప్రసాద్, చకిలం ఏకాంబరం, తోట శివకుమార్, జూలూరి శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, యుగంధర్, కుమారస్వామి, వడిచెర్ల శ్రీనివాస్, వడ్డె రవీందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవడం బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత రంగయ్య

గిర్మాజీపేట, ఏప్రిల్ 13: పాలకుల ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలతో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యత అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు సిహెచ్.రంగయ్య అన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని బాపూజీ మునిసిపల్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ అధ్యక్షతన పూలే, అంబేద్కర్ జయంతి జనజాతర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు పలు కుట్రలు జరుగుతున్నాయని, వీటిని తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని రక్షించుకుంటూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరూరి కుమార్, ఎం.వీరాస్వామి, జి.లింగమూర్తి, జి.సుధాకర్, ఉదయ్‌కుమార్, దయాకర్, శ్రీనివాస్, విజయ, సంగీత, అనిల్, శివ, హేమలత, ఎలీషా పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో అంబేద్కర్ జయంతి

వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి సూపరింటెండెంట్ పద్మావతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ ఎం.రాజు, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రొఫెసర్ లుడాక్షం దుర్గాభాయి, డాక్టర్ జ్ఞానేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వసంతలక్ష్మిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంతికుమారి, వసంత, ఈశ్వర్, పర్వీన్, శ్రీలత, కవిత పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమ నిధిని సేకరించిన సీఐటీయూ



పాత బీట్ బజార్‌లో వ్యాపారుల నుంచి నిధిని సేకరిస్తున్న కార్మికులు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 13: మహనీయులు జ్యోతిబా పూలే, అంబేద్కర్ బాటలో నడుద్దామని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని పాత బీట్ బజార్ ప్రాంతంలో శనివారం సీఐటీయూ కార్యకర్తలు ఉద్యమ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఏప్రిల్ మహనీయులను స్మరించుకునే మాసమని, ఎంతో మంది పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి మాట్లాడుతూ సమాజంలో అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గున్నాల ప్రభాకర్, ఉపేందర్, వాణి, రవీందర్, యాకూబ్, పాషా, మురళి, పెంటయ్య, లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన సీపీ



నర్సంపేట పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 13 : నర్సంపేట పోలీస్ స్టేషన్‌ను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధి కారులు, సిబ్బంది వివరాలతో పాటు పెండింగ్ కేసులు, స్టేషన్ పనితీరును విధు ల్లో ఉన్న రూరల్ సీఐ రాజగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.

మద్దతు ధరను చట్టం చేయాలి

రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

గీసుగొండ, ఏప్రిల్ 13: రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర చట్టబద్ధం చేసి రైతులపై పాలకులకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. 26న వరంగల్ అబ్బనికుంటలో నిర్వహించే రైతు సదస్సు ప్రచార వాల్‌పోస్టర్‌ను గీసుగొండలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రైతు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకంను అనుసధానం చేయాలన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలుదారులకు గుర్తింపు కార్డులను అందించి న్యాయం చేయాలని కోరా రు. సదస్సుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రొఫెసర్‌లు కోదండరాం, కూరపాటి వెంకటనారాయణ, యాదగిరిచార్యులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పారపు రాజు, లడే సమ్మారావు, శంకర్‌రావు, రవిందర్ పాల్గొన్నారు.

మానసిక వేదనతో భూ బాధితుడు మృతి



అశోక్ (ఫైల్)

ఖిలావరంగల్, ఏప్రిల్ 13: మానసిక వేదనతో గుండెపోటుకు గురై ఇన్నర్‌రింగ్ రోడ్(200 ఫీట్లు) భూ బాధితుడు నర్ర అశోక్ (56) శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. తూర్పుకోటకు చెందిన అశోక్ ఇన్నర్‌రింగ్ రోడ్‌లో భూమి కోల్పోయిన వారిలో ఉన్నారు. నష్టపరిహారం ఇవ్వాలని ఇన్నర్‌రింగ్ రోడ్ భూ బాధితుల సంఘం సభ్యులతో వరంగల్ కలెక్టరేట్, కుడా, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. ఇటీవల అధికారులు గతంలో కన్నా తక్కువగా నష్టపరిహారం చెల్లించే విషయంలో ఆయన మనోవేదనకు గురయ్యాడన్నారు. ఈ క్రమంలో శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఆయనకు భార్య రాధ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా, అశోక్ భౌతికకాయాన్ని వరంగల్ ఇన్నర్‌రింగ్ రోడ్ 200 ఫీట్ల భూ బాధితుల సంఘం అధ్యక్షుడు గంగుల దయాకర్, ఉపాధ్యక్షుడు పాలకుర్తి సత్యం, కమిటీ సభ్యులు గంగరబోయిన మధు తదితరులు సందర్శించారు.

ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పర్వతగిరిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పర్వతగిరి, ఏప్రిల్ 13 : వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎర్రబెల్లి నివాసంలో ఎంపీ అభ్యర్థితో కలిసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు కావాలని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, కానీ, వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. పార్టీ నుంచి నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్లినా కార్యకర్తలు మాత్రం పార్టీతోనే ఉన్నారని అన్నారు. అందరం కలిసికట్టుగా శ్రమించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. పర్వతగిరి మండల ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జిగా వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతిని నియమించినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, మాజీ మంత్రి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉండేదని, ప్రస్తుతం కరువుకాటకాలే రాజ్యమేలుతున్నాయని అన్నారు. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించుకుని పార్టీ గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అభ్యర్థిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మేడిశెట్టి రాములు, లూనావత్ పంతులు, వర్ధన్నపేట ఎంపీపీ అప్పారావు, వైస్ఎంపీపీ రాజేశ్వర్‌రావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, ఎంపీటీసీ మాదుగుల రాజు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ యుగేందర్ రావు, నాయకులు చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కరిమిళ్ల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మందులిప్పిస్తానని.. బంగారం దోపిడీ

ఆలస్యంగా ఫిర్యాదు చేసిన బాధితురాలు

మట్టెవాడ, ఏప్రిల్ 13: వరంగల్ ఎంజీఎం హాస్పటల్‌లో చికిత్సపొందుతున్న మహిళ వద్ద అటెండెంట్‌కు ఓ గుర్తు తెలియని మహిళ మందులు ఇప్పిస్తామని బంగారంతో పాటు రూ.వేయి నగదును దోచుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం గోవిందాపురంనకు చెందిన బోయిని సమ్మక్క ఫిబ్రవరి 24న అనారోగ్యం దృష్ట్యా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స కోసం చేరింది. సమ్మక్క కోడలు బోయిని కొమురమ్మ అత్తతోపాటే కోడలు ఎంజీఎంలో సహాయకురాలిగా చేరింది. ఫిబ్రవరి 25న గుర్తు తెలియని మహిళ బురఖా వేసుకొని వచ్చి చికిత్స పొందుతున్న బోయిని సమ్మక్కకు మందులిస్తాను అని తనతో రమ్మని కోడలు కొమురమ్మను ఎంజీఎం ఆస్పత్రి నుంచి బయట గోపాల్‌స్వామి గుడి వద్దకు తీసుకొచ్చింది. అక్కడ ఒక వ్యక్తిసాయంతో గుర్తు తెలియని మహిళ కొమురమ్మను చంపుతామని బెదిరించి ఆమెవద్ద నుంచి బంగారు కమ్మలు, అరతులం పుస్తెలు, రూ.వేయి నగదును లాక్కొంది.

ఈ మేరకు కొమురమ్మ అత్త సమ్మక్క చికిత్స పొందుతూ మార్చి 18న మృతిచెందింది. దీంతో ఆలస్యంగా వారం రోజుల క్రితం ఫిర్యాదు చేయడంతో, శనివారం మట్టెవాడ పోలీసులు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోదీది మోసం.. కేసీఆర్‌ది ద్రోహం

జాతీయ ఓబీసీ కమిటీ చైర్మన్ కత్తి వెంకటస్వామిగౌడ్



సంగెంలో మాట్లాడుతున్న వెంకటస్వామిగౌడ్

సంగెం, ఏప్రిల్ 13: దేశాన్ని అధోగతిపాలు చేసిన నరేంద్ర మోదీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, చిన్న రాష్ట్రాలను అణగదొక్కుతూ పాలన చేసిన ఘనత మోదీకే దక్కుతుందని జాతీయ ఓబీసీ కమిటీ చైర్మన్ కత్తి వెంకటస్వామిగౌడ్ అన్నారు. సంగెం మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ యేడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగ యువకులను మోదీ మోసం చేశారన్నారు. దేశంలో స్కాంలకు ఆజ్యం పోశారని అన్నారు. రైతన్నల నడ్డి విరిచి పాలన అందించారని, దీంతో వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు.

కేసీఆర్ ఉద్యమం పేరుతో రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని మరిచిపోయారని వెంకటస్వామిగౌడ్ అన్నారు. తన కుటుంబం కోసం పదేళ్లపాటు అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేశారన్నారు. నీటి ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కోట్లాది రూపాయలు దోచుకున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంటు మెట్టుపల్లి రమేష్, ఎంపీపీ కందకట్ల కళావతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగపాటి రాజుగౌడ్, జిల్లా నాయకులు జనార్దన్, పులి సాంబయ్య, నాయకులు కందకట్ల నరహరి, బాసిపాక సదయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు అచ్చ నాగరాజు, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య పాల్గొన్నారు.

బైక్‌లను దొంగిలించిన బాలుడి అరెస్టు

నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం: ఏసీపీ



స్వాధీనపర్చుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, ఏప్రిల్ 13: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఓ బాలుడిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీసీఎస్ సీఐ అబ్బయ్య తెలిపారు. మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో శనివారం అరెస్టుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన బాలుడు చెడు వ్యసనాలకు అలవాటుపడి నగరంలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. పార్కింగ్‌లో తాళం వేసి ఉన్న బైక్‌లను ఇటీవల చోరీ చేశాడు. మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలు, మామునూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. సీసీఎస్ పోలీసులు, మట్టెవాడ పోలీసులు అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో మట్టెవాడ పోలీసులు, సీసీఎస్ పోలీసులు వరంగల్ పోతననగర్ జంక్షన్ వద్ద శనివారం ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న బాలుడిని నిలిపి విచారించారు. దీంతో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడినట్లు అంగీకరించడంతో నిందితుడి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు చెప్పారు. బాలుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీసీఎస్ సీఐ అబ్బయ్య, మట్టెవాడ సీఐ గోపి, సీసీఎస్ ఎస్సై సంపత్, ఐడీ అసిస్టెంట్ సల్మాన్‌పాషా, ఎసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు మున్నా, రవి, వేణుగోపాల్, కానిస్టేబుళ్లు రాములు, చంద్రశేఖర్‌లను ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 14 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఉమ్మడి జిల్లా రైతు సదస్సు జయప్రదం చేయండి

దుగ్గొండి, ఏప్రిల్ 13 : వరంగల్ నగరంలోని అబ్బనికుంట తెలంగాణ రైతు సంఘం భవనంలో ఈ నెల 26న నిర్వహించే ఉమ్మడి జిల్లా రైతు సదుస్సు విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లడె మోహన్‌రావు తెలిపారు. మండలంలోని గిర్నిబావిలో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలపై, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సదస్సులో హై_కోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల బుచ్చిరెడ్డి, నల్లవిజయ్, శంకర్‌రావు ఓరుగంటి తిరుపతిలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



త్రైతసిద్ధాంత క్యాలండర్ ఆవిష్కరిస్తున్న డీసీపీ

నర్సంపేట, ఏప్రిల్ 13 : మనుషుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం కోసం త్రైత సిద్ధాంత కర్త ప్రబోధానంద యోగీశ్వరుల దివ్యాశీస్సులతో నూతన త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని డీసీపీ రవీందర్ అన్నారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో సీఐ, ఎస్సైలతో కలిసి త్రైతసిద్ధాంత క్యాలండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాలండర్‌లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతీ ఒక్కరికి సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్‌కుమార్, దుగ్గొండి సీఐ రాజగోపాల్, నెక్కొండ సీఐ చంద్రమోహన్, నర్సంపేట సీఐ రమణమూర్తి, చెన్నారావుపేట ఎస్సై అరుణ్, నెక్కొండ ఎస్సై మహేందర్, నల్లబెల్లి ఎస్సై రామారావు, దుగ్గొండి ఎస్సై పరమేశ్వర్, ఖానాపురం ఎస్సై రఘుపతి, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాశ్‌ఆచారి, సభ్యులు హనుమయ్య నిజాం, సైదులు, రమణాచారి, కిరణ్, విక్రమ్, నిర్మల, అక్షయ, శశిరేఖ, రోహిణి పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం దిలీప్‌సింగ్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 13 : ఆల్ ఇండియా టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో వర్ధన్నపేట పట్టణంలోని శ్రీఅరబిందో పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. నవంబరు నెలలో జరిగిన ఈ పోటీ పరీక్షల్లో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 9వ తరగతికి చెందిన నిహారిక, 7వ తరగతికి చెందిన లక్ష్మీప్రణతి, 4వ తరగతికి చెందిన అక్షయ్ కన్నాలు ఆల్ ఇండియాలో 2వ స్థానంలో నిలవగా వారికి స్మార్ట్ వాచ్‌లను బహూకరించారు. 65 మంది విద్యార్థులు స్వర్ణ పథకాలు గెలుచుకోగా, మరో 100 మందికి పైగా విద్యార్థులు మార్కులు సాధించడంలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం దిలీప్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యంగా పాఠశాల ఉపాధ్యాయులు కృషిచేయడం గర్వ కారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ మహేష్, పాఠశాల అకాడమిక్ డీన్ వీరన్న, ప్రైమరీ పాఠశాల ఇన్‌చార్జి అనిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులలో మద్యం పట్టివేత

దుగ్గొండి, ఏప్రిల్ 13:మండలంలోని గిర్నిబావిలో బెల్ట్‌షాపులలో అక్రమంగా మద్యం నిల్వచేసి అమ్ముతుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడిచేసి పట్టుకున్నారు. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం... గిర్నిబావిలోని బెల్ట్ షాపులలో రాజు, రామోజీ, ప్రభాకర్‌లు మద్యం అమ్ముతుండగా, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెల్ట్‌షాపుల్లో సోదాలుచేసి రూ.75,950 విలువ చేసే మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. దాడుల్లో ఏఎస్సై విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

పర్వతగిరి, ఏప్రిల్ 13 : మండలంలోని కొంకపాక గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి కాషాయకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం పురోగమిస్తుందని భావించిన ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాయబారపు వివేక్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు రాయబారపు రమాదేవి, నల్ల రమేష్, నల్ల దేవేందర్, ముద్రబోయిన దుర్గయ్య, నాగరాజు, సరస్వతి, రమ, రజిత, స్వరూప, యశోద తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, నాయకులు కొయ్యడ రాజుగౌడ్, రంగు కుమార్, చీమల భిక్షపతి, విజయ్, మధు, రఘువరణ్, ఆశోక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ వెంటే దళితులు'

పర్వతగిరి, ఏప్రిల్ 13 : దళితులంతా కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ వచ్చిన వారిని గెలిపించుకోవడానికి గాను దళితులంతా సిద్ధంగా ఉన్నారని, కావాలనే ఇతర పార్టీల నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దళితులంతా బీజేపీకి ఓటు వేయాలని మంద కృష్ణమాదిగ చెప్తున్నారని, గతంలో వర్ధన్నపేట అసెంబ్లీ స్థానానికి ఆయన పోటీ చేసినప్పుడు దళితులు ఎవరూ ఆయనకు ఓటువేయని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పదవీ కోసం పార్టీ మారారని కడియం కుటుంబాన్ని ఎద్దేవా చేస్తున్నారని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ చేసిన పనేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దబ్బెట నర్సయ్య, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, నాయకులు మాసాని యాకూబ్, తాళ్ల రమేష్, జిల్లా కనకయ్య, దండెపల్లి సైదులు పాల్గొన్నారు.

అందమైన కథల సమాహారమే 'నర్సంపేట కథలు'



లీడ్ లైబ్రరీ నిర్వాహకుడికి కథల పుస్తకాలను అందిస్తున్న రచయిత

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 13 : పుట్టి పెరిగిన ఊరుతో ఉన్న అనుబంధానికి, ఊహాశక్తిని జోడించి రాసిన అందమైన కథల సమాహారమే నర్సంపేట కథల పుస్తకమని లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ అన్నారు. విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న మొగిలి అనిల్‌కుమార్ రెడ్డి తాను రచించిన నర్సంపేట కథలు పుస్తకాలను నర్సంపేట లీడ్ లైబ్రరీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నర్సంపేట కథలు పుస్తకం మొదటి భాగంలో పది కథలు, రెండో భాగంలో రచయిత జ్ఞాపకాలు కథలుగా ఉన్నాయన్నారు. మొదటి భాగంలో కథల కేంద్రం నర్సంపేట అయినా అవి కల్పనతో కూడినవని, జ్ఞాపకాలులో మాత్రం తాను పుట్టి పెరిగిన నర్సంపేటతో తనకున్న అనుబంధాన్ని గురించి అనేక కోణాలు రాశారన్నారు. నర్సంపేట ప్రజలంద రూ గర్వించదగిన పుస్తకమని, రచయిత అనిల్‌కుమార్‌రెడ్డి కలం నుంచి భవిష్యత్తు లో మరెన్నో పుస్తకాలు రావాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజల కోసం విమర్శించాలి..

నల్లబెల్లి, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ పార్టీ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల కోసం విమర్శించాలి కానీ, చిల్లర రాజకీయాల కోసం విమర్శించడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు మంచే చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వైనాల అశోక్, ఇస్తారు శేకర్, చార్ల శివారెడ్డి, మాలోతు చరణ్‌సింగ్, పురుషోత్తంసురేష్, ఎరుకల రవీందర్, జెట్టి రామ్మూర్తి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంజూరైన రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

ఖానాపురం, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన రోడ్ల నిర్మాణాలను ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య తక్కళ్లపల్లి బాబురావు, ఫైండ్ల యాదగిరి, మౌలానా, రామస్వామి, కోరె సుధాకర్, కుందనపల్లి శైలజ, బాలునాయక్ పాల్గొన్నారు.

మృత్యు మలుపులు..!

ముళ్ల పొదలతో గ్రామాల ప్రధాన రహదారులు

పట్టించుకోని అధికారులు

రాత్రిపూట వెళ్లాలంటే జంకుతున్న వాహనదారులు



రాయపర్తి నుంచి రాగన్నగూడెం వెళ్లే దారిలో ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు



కొలన్‌పెల్లి నుంచి దర్దెపెల్లికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూల మలుపు

రాయపర్తి, ఏప్రిల్ 13 : మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మూలమలుపులు మృత్యు మలుపులుగా మారాయి. వాహనాదారులు రాత్రి పూట వాహనదారులు ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. దీనికి తోడు మూల మలుపుల వద్దే భారీగా ముళ్ల పొదలు పెరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముళ్లపొదల కారణంగా రాత్రి పూటే కాక పగటి పూట సైతం వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

మండలంలో ఇలా...

మండలంలోని పెర్కవేడు గ్రామం నుంచి పాలకుర్తికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ముళ్ల పొదలు పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే గామం నుంచి అన్నారం, గట్టికల్లు, కిష్టాపురం క్రాస్ రోడ్డుకు వెళ్లే దారిలో మూలమలుపులతో పాటు చెట్లు పెరిగి కనిపిస్తున్నాయి. పన్యానాయక్ తండా, కొత్తూరు, ఏకేతండా, వావిలాల, గుర్రాలపెల్లి బీటీ రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. మండలంలోని తిర్మలాయపెల్లి గ్రామం నుంచి బురహాన్‌పెల్లి, కొండూరు, అటుగా రాయపర్తి మండల కేంద్రానికి చేరుకునే రహదారిలో మూలమలుపుల వద్ద అత్యంత ప్రమాదకరంగా ముళ్ల పొదలు పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి.

ప్రమాదాల బారిన...

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు, వాటిని కలిపే రహదారుల వెంబడి ముళ్ల పొదల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఆటో, బైక్ ఢీకొని ఒకరు మృతిచెందగా, గతంలో విశ్రాంత ఉద్యోగి మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలతో మృతిచెందాడు. ఎక్కడ చూసిన మంగళగిరి తుమ్మలే రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఉపాధి హామీ కూలీలతో ముళ్లపొదలను శుభ్రం చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

జంగిల్ కటింగ్ స్కీం లేదు..

కిషన్ నాయక్, ఎంపీడీవో, రాయపర్తి



ఉపాధి హామీ పథకంలో జంగిల్ కటింగ్ స్కీం పనులను ప్రభుత్వం తీసివేసింది. దీంతో సంవత్సర కాలంగా అట్టి పనులను చేయడం లేదు. సంబంధిత అధికారులే రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలి.

ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవాలి...

మొర్రి రాజేందర్, కాట్రపెల్లి



ఆర్అండ్‌బీ అధికారులు మూలమలుపుల వద్ద రోడ్డుకు ఇరుపక్కల పెరిగిన ముళ్ల పొదలను తొలగించేందుకు చొరవ తీసుకోవాలి. ఉపాధి హామీ పనుల కూలీలతో వీటిని తొలగిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది. ప్రమాదానికి కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలు బాటసారులను సైతం ఢీకొడుతున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ముళ్ల పొదలను తొలగించాలి.

బీజేపీ సభకు తరలిన నాయకులు



విజయ సంకల్ప సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 13 : మహబూబాబాద్‌లో శనివారం జరిగిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళన సభకు నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మెన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు ఆధ్వర్యంలో బూత్ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. సభకు తరలిన వారిలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహ రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, బాల్నె జగన్, గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, శివరాజు సింగ్, విజయ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పూర్తి బాధ్యత ఎమ్మెల్యే దొంతిదే..

నల్లబెల్లి, ఏప్రిల్ 13 : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన రోడ్ల నిధులతో పనులు జరగకుంటే పూర్తి బాధ్యత నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డే వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వమనిచెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం మంజూరైన రోడ్లను ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, సట్ల శ్రీనివాస్, ఇంగ్లీ శివాజీ, కాత్యం శ్రీనివాస్, గుమ్మడి వేణు, జన్ను జయరావు, నన్నేసాహబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల నిరసన



కోపాకుల చెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

చెన్నారావుపేట, ఏప్రిల్ 13 : ఎనిమిది వారాలుగా చేసిన కూలీకి కూలి డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధిహామీ కూలీలు శనివారం పనిచేసే ప్రదేశంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని కోపాకుల చెరువులో పూడిక మట్టిని ట్రాక్టర్లలో తరలించేందుకు ప్రతీరోజు పనులకు వెళ్తున్నామన్నారు. ఈ సంవత్సరం రోజువారీ కూలీ రూ.240 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదనవ్యక్తంచేశారు. అధికారులు చొరవ తీసుకొని వారం వారం డబ్బులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల మాధవి. హంస అరుణ, బొండ రామమ్మ, పిట్టల కొమల , వరంగంటి కుమారస్వామి, వజ్జేంతి రమా, మాధవి, తులసీ, కొంరమ్మ, రామమ్మ పాల్గొన్నారు.

'ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి'



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పర్వతగిరి, ఏప్రిల్ 13 : వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎర్రబెల్లి నివాసంలో ఎంపీ అభ్యర్థితో కలిసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పు కావాలని ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, కానీ, వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విరక్తి కలిగిందన్నారు. పార్టీ నుంచి నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్లినా కార్యకర్తలు మాత్రం పార్టీతోనే ఉన్నారన్నారు. అందరం కలిసికట్టుగా శ్రమించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. పర్వతగిరి మండల ఎంపీ ఎన్నికల ఇన్‌చార్జిగా వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతిని నియమించినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ మాట్లా డుతూ తనపై నమ్మకముంచి ఎంపీ టికెట్ కేటాయించడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, మాజీ మంత్రి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రం సుభిక్షం గా ఉండేదని, ప్రస్తుతం కరువుకాటకాలే రాజ్యమేలుతున్నాయన్నారు. ప్రతీ కార్యకర్త తానే అభ్యర్థి గా భావించుకుని పార్టీ గెలుపునకు కృషిచేయా లని పిలుపునిచ్చారు. అనంతరం అభ్యర్థిని శాలు వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు మేడిశెట్టి రాములు, లూనావత్ పంతులు, వర్ధన్నపేట ఎంపీపీ అప్పారావు, వైస్‌ఎంపీపీ రాజేశ్వర్‌రావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, ఎంపీటీసీ మాడుగుల రాజు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ యుగేందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రార్థనలు చేసిన ఇంట్లోనే పాస్టర్ దొంగతనం

• 48 గంటల్లో చోరీని ఛేదించిన పోలీసులు



నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్సై

నెక్కొండ, ఏప్రిల్ 13 : నిత్యం ఇంట్లో పార్థనలు చేస్తూ కుటుంబ సభ్యుడుగా ఉంటున్న బాప్టిస్ట్ చర్చి పాస్టర్ అదే ఇంట్లో చోరికి పాల్పడిన సంఘటన మండలోని అప్పల్‌రావు పేటలో జరిగినట్లు నెక్కొండ సీఐ చంద్రమోహన్ శనివారం తెలిపారు. దొంగతనం జరిగిన 48 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అలంకానిపేట గ్రామానికి చెందిన పాస్టర్ దంతాల రవి అప్పల్‌రావుపేట గ్రామంలోని బాప్టిస్ట్ చర్చిలో గత 18 సంవత్సరాలుగా పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన తిప్పని వీరభద్రయ్య కుటుంబ సభ్యులు నిత్యం చర్చికి వెళ్లేవారు. వీరభద్రయ్య కుటుంబ సభ్యులతో అతి చనువుగా ఉంటున్న పాస్టర్ రవి కొద్దిరోజుల తరువాత కుటుంబ సభ్యుల్లో ఒక్కరిగా మారారు. వీరభద్రయ్య ఇంటికి వచ్చి నిత్యం ప్రార్థనలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదిన వీరభద్రయ్య-ప్రమీల దంపతులు ఉపాధి కూలీ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటికి వచ్చిన పాస్టర్ రవి ఇంటి తలుపులను తాళ్లం చెవులతో తెరిచి బీరువాల్లో ఉన్న ఆరు తులాల బంగారు అభరణాలు, రూ.60,200 నగదును దొంగలించాడు. బాధితుడు తన ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని పోలీసుకు ఫిర్యాదు చేయగా, క్లూస్ టీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. సెల్ టవర్ ఆధారంగా పోలీసులు చోరీ జరిగిన 48 గంటల్లో నిందితుడిని గుర్తించారు. పవిత్రమైన పాస్టర్ వృత్తిలో ఉన్న రవి దొంగతనానికి పాల్పడ్డ విషయం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసిందన్నారు. నిందుతుడిని పట్టుకున్న పోలీసులు చోరీకి గురైన సొమ్మును రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టుకు పంపించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యాన్ని ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్, పీసీలు రమేశ్, రాకేశ్, వెంకటేశ్వర్లు, సాల్‌మాన్‌పాషాలను నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారని సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవ పూజలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 13: మండలంలోని లక్నేపల్లిలో శ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయంలో వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం బాధ్యులను మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మర్థ సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మర్థ సదయ్య, కార్యదర్శి గొడిశాల సురేష్‌గౌడ్‌లతో పాటు మోకుదెబ్బ నాయకులు పాల్గొన్నారు.

నర్సంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ




నర్సంపేట పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 13 : నర్సంపేట పోలీస్ స్టేషన్‌ను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలతో పాటు పెండింగ్ కేసులు, స్టేషన్ పనితీరును విధుల్లో ఉన్న రూరల్ సీఐ రాజగోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.

నేడు మెపా డివిజన్ కమిటీ ఎన్నిక

నర్సంపేట, ఏప్రిల్ 13: పట్టణంలోని ఎంఎఫ్‌సి హోటల్ ఆవరణలో ఈ నెల 14న ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) నర్సంపేట డివిజన్ కమిటీ ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు.శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు డివిజన్‌లోని ఆరు మండలాల ముదిరాజ్ కులస్తులు హాజరుకావాలని ఆయన కోరారు. సభ్యుల సమక్షంలో డివిజన్ కమిటీని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ కన్వీనర్ పెండ్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య



రవి (ఫైల్)

నల్లబెల్లి, ఏప్రిల్ 13 : అనారోగ్యంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మధ్యాహ్నం మండలంలోని రంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఇదే గ్రా మానికి చెందిన భూమ రవి(42) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత వాదించిన వినకుండా ప్రతి రోజూ మద్యం తీవ్రంగా తాగే వాడు. ఇటీవల అరోగ్యం కూడా బాగా క్షీణించింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు సపోర్ట్‌గా ఉన్న కర్రకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీకి పోయిన రవి భార్య తిరిగి మధ్యాహ్నం ఇంటి వచ్చి తలుపులు ఎంత కొట్టినా తియకపోయేసరికి అనుమానం వచ్చి కిటికిలోంచి చూసే సరికి భర్త రవి ఉరి వేసుకొని వేలాడుతున్నాడు. దీంతో బోరున విలపిస్తూ చుట్టు పక్కల వారిని పిలిచి, వారి సాయంలో తలుపులను పైకి తీశారు. అప్పటికే రవి మృతి చెందాడు. మృతుడి భార్య భూమ మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు. కాగా, మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

'అంబేద్కర్'కు రంగులు వేయించాలి



వినతిపత్రం అందిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 13: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం జరుగనున్నందున పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి రంగులు వేయించి పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతూ శనివారం మునిసిపల్ అధికారి నాగరాజుకు దళిత ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్ద వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు కల్లెపల్లి ప్రణయదీప్, గుంటి వీరప్రకాశ్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ, సీనియర్ సిటిజన్స్, మహిళా యువజన, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గణేశ్ పాల్గొన్నారు.

సాంస్కృతిక రంగాల్లో రాణించాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 13: విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక రంగాల్లోరాణించాలని నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని శ్రీఅబ్యాస్ హైస్కూల్‌లో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏసీపీ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు కరాటే, యోగా, కర్రసాము, ఆర్చరీ, సంగీతం తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వాలని యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నరహరి స్వాతి, రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కుమార్, ఏవో కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని చేయని నిఘా నేత్రాలు

నిర్వహణ లోపంతో మూన్నాళ్ల ముచ్చటగానే ఉండిపోయిన వైనం



తిమ్మంపేటలో పనిచేయని సీసీ కెమెరా



తిమ్మంపేటలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

దుగ్గొండి, ఏప్రిల్ 13 : గ్రామాల రక్షణకు ఏర్పాటు చేసుకున్న నిఘానేత్రాలు (సీసీ కెమెరాలు), నిర్వహణ లోపంతో మూన్నాళ్ల ముచ్చటగానే నిరుపయోగంగా కొన్ని గ్రామాల్లో ఉండిపోయాయి. గ్రామాల్లో చోరీల నివారణ, కొత్త వ్యక్తులను, రోడ్డు ప్రమాదాలు సులభంగా గుర్తించడానికి పోలీసుల చైతన్యంతో గ్రామస్థులు, దాతలు, వ్యాపారస్థుల సాయంతో మూడేళ్ల కిందట ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కొత్తలో పనిచేసి రానురాను సీసీ కెమెరాలపై నిఘాలేకపోవడం, వివిధ కారణాలతో మరమ్మతులకు రావడంతో అవి పని చేయడం లేదని పలువురు తెలుపుతున్నారు. గాలి దుమారం, వాహనాల రాకపోకలతో సీసీ కెమెరాల కెబుల్ తెగిపోవడం, మళ్లీ రిపేరుకు నోచుకోక స్తంభాలకు కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని తిమ్మంపేట, చలపర్తి, రేకంపల్లి, నాచినపల్లి, గిర్నిబావి, దుగ్గొండి, లక్ష్మీపురం, చాపలబండ తదితర గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దుగ్గొండి, గిర్నిబావి, లక్ష్మీపురం గ్రామాల్లో పోలీసుల చొరవతో కొన్ని సీసీ కెమెరాలు పనిచేస్తుండగా, మిగతా గ్రామాల్లో పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్నట్లు పలువురు వాపోతున్నారు.

నిర్వహణ లోపంతో...

గ్రామాలకు రక్షణగా పనిచేస్తాయనే బలమైన కారణంతో దాతలు సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభంలో ఉన్న శ్రద్ధ రానురాను వాటిపై పర్యవేక్షణ లేక పోవడం, సీసీ కెమెరాలు విక్రయదారులతో వాటి నిర్వహణ బాధ్యతలు కొన్నేళ్ల వరకు చూచుకునే విధంగా ఒప్పందం చేసుకోకపోవడంతో నెలల వరకే పనిచేసి నిరుపయోగంగా ఉన్నాయి. వర్షాకాలంలో ఉరుముల మెరుపులతో సీసీ కెమెరాలు ధ్వంసం కావడం, గాలి దుమారం, వాహనాల రాకపోకలతో కెబుల్ తెగిపోయాయి. మండలంలోని తిమ్మంపేటలో 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, గాలి దుమారంతో కెబుల్ తెగిపోయి మరమ్మతులకు నోచుకోక పని చేయడంలేదు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులకు నోచుకోక, నిర్వహణ లేకపోవడంతో పని చేయడంలేదని వివిధ గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

పోలీసులదే ప్రధాన భూమిక ...

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ఉపయోగాలపై గ్రామస్తులతో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి వారిని చైతన్య పరచి గ్రామస్తులను భాగస్వాములు చేయడంలో పోలీసులు ప్రధాన భూమిక పోషించారు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై స్థానికంగా నిర్వహణ చేయకపోవడం, వాటి మరమ్మతులు చేసే వారు స్థానికంగా లేకపోవడంతో మూలన పడిపోయాయి. మళ్లీ సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

గ్రామస్థులను భాగస్వాములను చేస్తాం...

జక్కుల పరమేశ్, ఎస్సై, దుగ్గొండి



సీసీ కెమెరాలు పనిచేయని గ్రామాల్లో మళ్లీ పనిచేసే విధంగా గ్రామస్తులను భాగస్వాములను చూస్తాము. ఇప్పటికే గిర్నిబావి, దుగ్గొండి, లక్ష్మీపురంలలో మళ్లీ సీసీ కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నాము. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణలో స్థానికుల బాధ్యత కొంతవరకు లోపించడం, మరమ్మతులకు రావడం, రిపేరు లేక పోవడంతో అవి పని చేయడం లేదు. ఎన్నికల అనంతరం ప్రతీ గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామస్థుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పని చేసే విధంగా చర్యలు చేపడతాము.